


నేడు విద్యుత్ భారాలపై ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా శుక్రవారం ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగు త్రైమాసికాలకు ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో 8,114 కోట్ల రూపాయల భారం మోపేందుకు ప్రతిపాదనలను అసెంబ్లీ ఎన్నికలకు ముందే విద్యుత్ నియంత్రణ మండలికి పంపినా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు వీటిపై ప్రజాభిప్రాయం తీసుకోకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా హిందూజా సంస్థకు రూ.1,234.68 కోట్లు విద్యుత్ సంస్థలు చెల్లించడం అన్యాయం అన్నారు. ఈ భారాన్నీ ట్రూఅప్ ప్రతిపాదనలలో కలపడం శోచనీయమన్నారు.

నాలుగు దశాబ్దాలుగా... చస్తే... చావే..!



నీళ్లల్లో పాడె మోస్తున్న కస్తూరినాయుడు కండ్రిగ గ్రామస్తులు (ఫైల్‌ఫోటో)

నీళ్లల్లో పాడె మోయాల్సిందే

ప్రజాశక్తి - నాగలాపురం

ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్, స్పందన... పేరు ఏదైతేనేం.. సమస్యల పరిష్కారానికే జరుగుతుంది.. ఏ సమస్య అయినా 'రీ' ఓపెన్ చేయకూడదని, ఖచ్చితంగా పరిష్కరించేలా చూడాలని, ఎప్పటికప్పుడు సమస్య పరిష్కారం ఎంత వరకూ వచ్చిందో ఫిర్యాదుదారునికి తెలియజేయాలని కలెక్టర్ ప్రతి సోమవారం జరిగే కార్యక్రమం అనంతరం అధికారులతో సమీక్షిస్తూ ఉంటారు.. ఎటువంటి సమస్యలను అధికారులు పరిష్కరిస్తారో తెలియదు గాని, నాగలాపురం మండలంలో నాలుగు దశాబ్దాలుగా ఈ సమస్య నలుగుతూనే ఉంది.. ఆ ప్రాంతంలో ఎవరైనా చస్తే వారి చావుకొచ్చిందన్నమాటే.. శవాన్ని ఇంట్లో పెట్టుకోలేం.. పూడ్చి పెట్టాలంటే ఏరు దాటాల్సిందే.. ఒకవేళ బరువున్న మనిషైతే నీళ్లల్లో నడుస్తూ 'పాడె' మోయడం ఎంత కష్టమో ఆ బాధ పగవాడికి కూడా రాకూడదు.. మరి అంతటి కష్టం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామ పంచాయతీ కస్తూరినాయుడు కండ్రిగ గ్రామానికి వచ్చింది.. 500 మంది జనాభా ఉన్న ఈ గ్రామానికి దగ్గరలో స్మశానం లేదు. అక్కడి ఎంఎల్‌ఎలకు, అధికారులకు ఈ సమస్య తెలిసినా నిర్లక్ష్యం నిర్లజ్జగా ఉందనే చెప్పాల్సి ఉంటుంది. రూ.70 లక్షలతో ఓ వంతెన కడితే అక్కడి సమస్య పరిష్కారం అవుతుంది.. అయితే పట్టించుకునే 'దిక్కు' లేదు.

కస్తూరినాయుడు కండ్రిగ గ్రామవాసులకు వర్షం వస్తుందంటే భయం.. ఇంట్లో కుండ ఉడుకుతుందో లేదో అని కాదు.. ఎవరైనా చస్తే పాడె మోయడానికి. స్మశానానికి వెళ్లాలంటే అరుణానది సమీపంలో ఉన్న ఈ కాల్వ నీటిలో శవాన్ని ఓ పక్క భుజాలపై మోసుకుంటూ నీటిలో ఈదుకుంటూ వెళ్లి అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు మారినా, వారి సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. తాజాగా మూడు రోజుల క్రితం తుపాను సందర్భంగా గ్రామంలో నివాసం ఉంటున్న శంకర్ (53) మంగళవారం వేకువజామున అనారోగ్యంతో మృతిచెందాడు. తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కాల్వలో నీళ్లు పెద్దఎత్తున వచ్చాయి. దీంతో గ్రామస్తులు భవాన్ని భుజాలపై మోసుకుంటూ నడుములోతు నీళ్లల్లో పాడె మోసుకుంటూ తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు.

వంతెన ఏర్పాటు చేయాలి : మురళి, టిడిపి గ్రామ అధ్యక్షులు

మా గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లేందుకు అరుణానదికి సంబంధించిన కాల్వను దాటి వెళ్లాల్సి ఉంది. వర్షాకాలం వస్తే ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించాలంటే కాల్వలో ప్రవహించే నీటిని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. కనీసం ఈ కూటమి ప్రభుత్వంలో అయినా స్పందించి వంతెన నిర్మాణం ఏర్పాటు చేసి తమ సమస్య పరిష్కరించాలి.

అంత్యక్రియలకు తప్పని తిప్పలు : రుద్రయ్య, టిడిపి

ప్రతి ఏటా వర్షాకాలంలో మా గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు తప్పని తిప్పలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇదివరకు అనేకమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రభుత్వమైనా మా సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం.

రూ.70 లక్షలతో అంచనా వేశారు : జయప్రకాష్, పల్లికొండేశ్వర కమిటీ మాజీ సభ్యులు

గత ప్రభుత్వంలో గ్రామస్తులందరూ కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం. సమస్యను వివరించాం. అప్పట్లో కలెక్టర్, ఎంఎల్ఎ ఆదిమూలం సానుకూలంగా స్పందించి దాదాపు 70 లక్షలతో అంచనాలు తయారు చేయించారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. వంతెన నిర్మాణం చేపట్టలేదు. కనీసం కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిర్మాణం చేపట్టాలి.

చెరువులు నిండాలి... 'చేలు' పండాలి..!



ప్రజాశక్తి - డక్కిలి

వర్షాకాలం ప్రారంభం నుంచి భారీ వానలు పడలేదు. దీంతో వరి సాగు పై అంతంత మాత్రంగానే ఆశలు పెట్టుకున్న రైతులకు అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు రబీ సాగుకు భరోసా ఇచ్చాయి. వెంకటగిరి నియోజకవర్గం రాపూరు మండలంలో కండలేరు ప్రాజెక్టు ఉన్నా దానికి అనుసంధానంగా నిర్మించిన బ్రాంచ్ కాలువల పనులు పూర్తికాకపోవడంతో వాటి నుంచి నీటి విడుదల అంతంత మాత్రంగానే ఉండి రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదు. రైతులకు చిన్న సాగునీటి వనరులైన చెరువులే పంటల సాగుకు ఆధారం. వెంకటగిరి మండలంలో 102, డక్కిలిలో 62, బాలాయపల్లిలో 92 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో మొన్నటి వరకు నీరు లేక వెలవెలబోతున్నాయి. ఇలాంటి తరుణంలో నాలుగు రోజులుగా కురుసిన వర్షాలకు వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చెరువులు, కుంటలు క్రమంగా నిండుతున్నాయి. ఈ వర్షాలు ఉద్యాన తోటలు, ఆరుతడి పంటలతో పాటు వరిసాగుకు అనుకూలంగా మారాయి. వరి నారుమళ్లు పోసుకునేందుకు ఆలస్యమవుతాయని ఆందోళన చెందిన రైతులకు ఈ వర్షాలు ఉపశమనం కలిగించాయి. సోమవారం నుంచి బుధవారం వరకు నియోజకవర్గ

తుపానుతో భూగర్భజలాలు పెంపు

వ్యాప్తంగా మొత్తం 226.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొన్నటివరకు చుక్కనీరు లేక వెలవెలబోయిన తిమ్మాయకుంట , సింగమాంబపురం చెరువులు 50 శాతం వరకు , మిగిలిన చెరువులు 25 శాతం నుంచి 40శాతం వరకు నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలియజేస్తున్నారు. వెంకటగిరి మండలంలోని వల్లివేడు, అమ్మవారిపేట, కుమ్మరి గుంట, డక్కిలి మండలం మోపూరు , సంగనపల్లి, దందవోలు చెరువుల్లో తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరుతుండడం రబి సీజన్ పంటల సాగుపై రైతులకు భరోసా కలిగింది. చెరువులు, కుంటలు, వ్యవసాయ బావుల్లోకి నీరు చేరడంతో పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బోరు బావులు, బావులపై ఆధారపడిన పలువురు రైతులు ఇప్పటికే నార్లు పోసుకొని ఉన్నారు. మరి కొంతమంది రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకునే పను ల్లో నిమగ్నం అవుతున్నారు. ఇక చెరువుల్లోకి చేరుతున్న నీటితో రానున్న రోజుల్లో బోరు బావుల్లో భూగర్భజలాలు పెరిగి ప్రస్తుత రబీ సీజన్ పంటలతో పాటు ఖరీఫ్ పంటలకు ప్రయోజనం ఉంటుందనీ రైతులు చెబుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -రేణిగుంట

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలం జ్యోతి నగర్, కరకంబాడి నందు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. జ్యోతినగర్‌కు పది లక్షలు, తారకరామనగర్‌కు 22 లక్షల నిధులు రోడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయి. బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలు ఇచ్చిన ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి పనులు చేపడుతున్నారని వెల్లడించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, చిన్నారెడ్డి, డి పుష్ప నాదం పాల్గొన్నారు.



ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దంటూ సిపిఎం నిరసన

ఇళ్ల మధ్య మద్యం దుకాణాలొద్దు :సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

డిబిఆర్ ఆస్పత్రి పక్కన ప్రజలకు హాని కలిగించే మద్యం దుకాణాన్ని తొలగించాలని సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. ఆస్పత్రి పక్కన ప్రారంభించిన మద్యం దుకాణాన్ని ఎత్తేయాలంటూ స్థానికులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. గుడి, బడి, ఆస్పత్రి, నివాసాల వద్ద మద్యం దుకాణాలు ఉండరాదన్న నిబంధన ఉన్నా నిర్వాహకులు తుంగలో తొక్కి మద్యం దుకాణం తెరవడం సిగ్గుచేటన్నారు. మద్యం వల్ల హత్యలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వమే రాష్ట్రానికి ప్రధాన వనరుగా మద్యాన్ని చూడటం ఏంటని మండిపడ్డారు. ఆధ్యాత్మిక నగరాన్ని మత్తులో ముంచడం సరికాదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేణుగోపాల్, నాయకులు రమణయాదవ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఓజిలి... నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ మండల పరిధిలోని ఆర్మీనుపాడు గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో ఉన్న చోట కాకుండా, నూతన మద్యం షాపును ఇళ్ల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో మద్యం బాబులతో శాంతిభద్రతకు విఘాతం కలుగుతుందన్నారు. మద్యం దుకాణదారుడు మాట్లాడుతూ ప్రభుత్వ దుకాణం ప్రధాన మార్కెట్లో ఉందని, మళ్లీ అక్కడ ఏర్పాటు చేస్తే వాహన రాకపోకలకు ఆటంకంగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ సీఐ అరుణ కుమారి , పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివాదం లేకుండా సర్ది చెప్పారు. ప్రజలకు ఏదైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా రాసి ఇస్తే ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నూతన మద్యం షాపును అడ్డుకోవడం సమంజసం కాదని వారికి తెలియజేశారు .

ముందస్తు జాగ్రత్తలతో ఇబ్బందులు తప్పాయి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, అందరూ కలసికట్టుగా పనిచేయడంతో తుపాను ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. లోతట్టు ప్రాంతాలైన పూలవానిగుంట, కొరమేనుగుంట, ఆటోనగర్ ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న సహాయక చర్యలను, పునరావాస కేంద్రాలను గురువారం ఉదయం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా 30 ఎం.ఎం. వర్షపాతం నమోదయిందని అన్నారు. అదేవిధంగా కొండలపై నుండి ఎక్కువ నీరు రాకపోవడంతో కొంతమేర ఇబ్బందులు తప్పాయని అన్నారు. నెల రోజుల ముందుగానే నగరంలోని ప్రధాన కాలువల్లో చెత్త చెదారం, మట్టి తదితరాలను జెసిబి లతో తొలగించామని అన్నారు. దీంతో ఎక్కడా నీరు రోడ్లపైకి రాకుండా సజావుగా వెళ్ళిపోయాయని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, సి.పి.ఓ. దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి ఉన్నారు.



వరదనీరు తొలగిస్తూ...



వాల్మీకి జీవితం ఆదర్శనీయం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తి దాయకం అని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన జిల్లా స్థాయి వాల్మీకి జయంతి కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా, జెసి శుభం బన్సల్ తో కలిసి పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కషి ఉంటే మనుషులు ఋషులవుతారు అని, అలాంటి మహనీయులు మన వాల్మీకి మహర్షి అని వారి జీవితాన్ని మనం ఆదర్శంగా స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడిచేలా వారి స్ఫూర్తిని మనం స్మరించుకునే దానిలో భాగంగా వాల్మీకి జయంతిని మనం రాష్ట్ర పండుగ గా జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికార అధికారి చంద్ర శేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య, ఎబిసిడబ్ల్యుఓ జ్యోత్స్న పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. వాల్మీకి రచించిన రామాయణం జీవన అభ్యున్నతికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్పొరేటర్ నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్ పాల్గొన్నారు.

రేపు జీ తెలుగు కుటుంబం అవార్డ్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జీ తెలుగు కుటుంబ అవార్డ్స్ పార్ట్ 2 శనివారం సాయంత్రం ప్రసారం చేయనున్నట్లు తిరుపతి జిల్లా జి నెట్ వర్క్ సంస్థ ప్రకటనలో పేర్కొంది. తెలుగు ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించే ఛానల్ జీ తెలుగు. నటీనటులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం మాదిరిగానే 2024 సంవత్సరానికిగానూ ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్సు ఘనంగా నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖులు, జీ తెలుగు తారల సందడితో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమం మొదటి భాగం ఇప్పటికే ప్రసారం కాగా, రెండో భాగాన్ని ప్రసారం చేసేందుకు సిద్ధమైంది. ఈ మెగా ఈవెంట్ పార్ట్-2ను మీముందుకు తెచ్చేందుకు సిద్ధమైంది. అలరించే ప్రదర్శనలు, హదయాన్ని హత్తుకునే క్షణాలు, మరపురాని అనుభవాలతో తెలుగు టెలివిజన్ స్ఫూర్తిని ప్రతిబింబించే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం కానుంది. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆషిక, సౌందర్యల అద్భుతమైన ప్రదర్శనతో అన్ని సీరియల్ కుటుంబాల ప్రత్యేక ఎంట్రీతో ఘనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మేఘసందేశం సీరియల్ నటి భూమి నత్య ప్రదర్శన ఈవెంట్కి మరింత సంప్రదాయ కళను తీసుకొచ్చింది.



మృతుల కుటుంబాలకు బొజ్జల పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అమెరికా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హరితా రెడ్డి, సాయి రెడ్డి కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసముంటున్న భాస్కరరెడ్డి, లతల పెద్దకుమార్తె హరితారెడ్డి అమెరికాలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతిచెందగా, అదే ప్రమాదంలో ఆమె భర్త సాయి చెన్ను తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పట్టణంలోని బంగారమ్మ కాలనీలో ఉన్న భాస్కర్ రెడ్డి నివాసానికి వెళ్లి మృతుల చిత్రపటానికి నివాళు



లర్పించారు. భాస్కరరెడ్డి దంపతులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో మృతిచెందిన వారి భౌతికకాయాలను వీలైనంత త్వరలో భారత్ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. నేతలు విజయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కర్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు పాండిచ్చేరిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 2 నుంచి 5 వరకు జాతీయస్థాయి కర్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు - 2024 ఐదు మంది విద్యార్థినిలు పాల్గొనగా అందులో ఒకరు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి భువనేశ్వరి తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఎం.ధాత్రి మొ గధారమ్మను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల వలన పోరాట స్ఫూర్తి అలవడుతుందని, వైఫల్యం వాస్తవానికి ఓటమి కాదని లక్ష్యసాధనలో అదొక అంతర్భాగమని అలాంటి సరికొత్త ప్రయత్నాలు పదేపదే చేసేవారు తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. ఎం. ధాత్రి మొగధారమ్మ గోల్డ్ మెడల్, సి మహిమ, ఎస్ తేజశ్రీ, జై శైలజ, ఎం వదు వర్షినిలు గెలుపొందారు. వీరిలో ఎం.ధాత్రి మొగదారమ్మ ఉత్తరాఖండ్ హల్ద్వానిలోని ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ కర్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరందరికీ చక్కని తర్ఫీదు ఇచ్చి అంత సుదూర ప్రాంతానికి తీసుకెళ్లిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.



ఉసురు తీస్తున్న అప్పులు

గిరిజనులపై ఏజెంట్ల వల వేధింపులతో బలవన్మరణాలు 'వెట్టి'లో మగ్గుతున్న కుటుంబాలు

ప్రజాశక్తి - డక్కిలి

గిరిజనుల నిర్లక్ష్యరాస్యత ఏజెంట్లు, ఫైనాన్స్ వ్యాపారులకు 'పెట్టుబడి'గా మారింది.. పేదరికంతో మగ్గిపోతున్న వారికి అవసరం పేరుతో అప్పులిస్తూ, తడిచి మోపెడయ్యాక వేధిస్తూ ఫైనాన్స్ వ్యాపారులు (ఏజెంట్లు) లక్షలకు పడగలెత్తుతున్నారు.. తలకుమించిన అప్పులు కావడంతో, అవి తీర్చడానికి ఏజెంట్ల ద్వారా పనులకు వెళ్లడం వీరికి పరిపాటి. కూలి పనుల కోసం వలసెలుతున్న వీరికి కష్టాలే మిగులుతున్నాయి. పనులు చూపిస్తామన్న ఏజెంట్ల మాటలు నమ్మి వెళ్లిన వారికి అక్కడ ఉదయం నుంచి పొద్దుపోయే వరకూ కాయకష్టం చేసినా పొట్టకూటికి తప్ప, అప్పు పైసా తీరడం లేదు. దీంతో కొంతమంది రెక్కలు విరిగిన పక్షుల్లా స్వగ్రామాలకు చేరుతున్నారు. మరికొందరు చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయి బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనే డక్కిలి మండలం దందవోలు ఎస్టీ కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

డక్కిలి మండలం దందవోలు ఎస్టీ కాలనీకి చెందిన రవి ఉరఫ్ (దావీద్), చెంచులక్ష్మిలు భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలో పనులు లేకపోవడంతో తమకు తెలిసిన ఏజెంట్ ద్వారా వీరు అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని మందరం కొత్తపల్లికి చెందిన సిమెంట్ రాళ్ల వ్యాపారి వెంకట సుబ్బారెడ్డి వద్ద పనికి చేరారు. ఆ సమయంలో ఆ వ్యాపారి రవి దంపతులకు 76వేలు అప్పుగా ఇచ్చాడు. రోజుకూలి పూట గడవడానికే సరిపోయేది. అప్పు పైసా కూడా తీరకపోవడంతో వారు మనస్తాపం చెందారు. దీంతో ఆ దంపతులు కూలి ఎక్కువ ఇచ్చే రాపూరు మండలం గిలకపాడు వద్ద ఉన్న మరో సిమెంట్ రాళ్ల తయారీ వ్యాపారి వద్ద పనికి చేరారు. గిలకపాడు వద్ద పనిచేస్తూ



బాధిత చెంచులక్ష్మి కుటుంబ సభ్యులు

తాము సంపాదించిన 20వేలను గతంలో అప్పు ఉన్న వెంకట సుబ్బారెడ్డికి ఫోన్‌పే ద్వారా చెల్లించారు. అయితే 15 రోజుల క్రితం వెంకట సుబ్బారెడ్డి గిలకపాడు సిమెంట్ రాళ్ల తయారీ పరిశ్రమ వద్దకు వచ్చి తమకు ఇవ్వాల్సిన మిగిలిన 56వేలు వెంటనే చెల్లించాలన్నాడు. అయితే రవి కొన్ని రోజులు గడువిస్తే రుణం తీరుస్తామని ప్రాధేయపడ్డాడు. అయితే వెంకట సుబ్బారెడ్డి రవిని కిడ్నాప్ చేశాడు.

రోజులు గడిచినా భర్తను పంపించకపోవడంతో భార్య చెంచులక్ష్మి (30) మనస్తాపంతో శనివారం రాపూరు మండలం గిలకపాడు రోడ్డు వద్ద గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. చెంచులక్ష్మి మృతితో పదేళ్లలోపు పిల్లలు తల్లి ప్రేమకు దూరమై విలపించడం స్థానికులను కలచి వేసింది. గతంలోనూ వెంకట సుబ్బారెడ్డి దందవోలు గ్రామంలోని రవి బంధువులైన నాలుగు కుటుంబాల వారిని కిడ్నాప్ చేసినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. రవి తనకు చెప్పకుండా వెళ్లిపోయాడని, రుణం చెల్లించే వరకూ తన వద్ద పని చేయాల్సిందేనని ఆ నాలుగు కుటుంబాల వారిని బందీలుగానే ఉంచారని తెలుస్తోంది. అయితే దందవోలు సర్పంచి పెంచలయ్య జోక్యం చేసుకుని రవి అప్పు ఉంటే, వారి కుటుంబీకులను బందీలుగా ఉంచుకోవడం సరికాదని విడిపించినట్లు తెలుస్తోంది. గిరిజన కుటుంబాల్లోని నిరక్షరాస్యత, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని ఏజెంట్లు వారి శ్రమను దోచుకుంటున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. చెంచులక్ష్మి ఘటనతో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటిడిఎ అధికారులు దందవోలుకు మంగళవారం వెళ్లి విచారించి, నివేదికను సమర్పించారు.

చెంచులక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలి : టి.మల్లికార్జున్, యానాది సంక్షేమ సంఘం అధ్యక్షులు

చెంచులక్ష్మి మృతికి కారణమైన సిమెంట్ రాయి వ్యాపారి వెంకట సుబ్బారెడ్డిపై బాండెడ్ లేబర్ కింద కేసు నమోదు చేయాలి. ఎస్టీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద, ఐటిడిఎల ద్వారా చెంచులక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. గిరిజన కుటుంబాల్లో స్వయం ఉపాధికి రుణాలిచ్చి వారి అభ్యున్నతికి కృషి చేయాలి.

22 నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పురపాలక పరిధిలోని సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్డేటెడ్, చిరునామా మార్పునకు ఈనెల 22వ తేదీన ఇందిరానగర్ -3, చెన్నూరు -2 సచివాలయం, 23వ తేదీన ఇందిరా నగర్ -1, చెన్నూరు -1 సచివాలయం, 24వ తేదీన నరసింగరావు పేట, చెన్నూరు -3 సచివాలయం, ఈనెల 25వ తేదీన మాలవ్య నగర్ -3 సచివాలయం, నెల్లటూరు సచివాలయంలో ఆధార్ క్యాంపులును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెందోడులో ఇంటి స్థలంపై వివాదం



ధ్వంసం చేసిన ప్రహారీ గోడ

ప్రజాశక్తి-కోట: మండలంలోని చెందోడు పంచాయతీలో బేకరీ శివలింగం అనే వ్యాపారి ఇంటి ప్రహరీగోడను ప్రక్కనే స్థలానికి చెందిన పలువురు ధ్వంసం చేశారు.. దౌర్జన్యంగా, అక్రమంగా గోడను పగలగొట్టి తమను బెదిరింపులుకు గురిచేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు శివలింగం, దుర్గా గురువారం విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై ఎస్ఐ పవన్‌కుమార్‌ను సంప్రదించగా మాట్లాడుతూ స్థల వివాదం తమ దృష్టికి వచ్చిందని, ఇరువురితో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

21న మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో 21న ఉదయం 10గంటలకు ఎంఎ, ఎఎస్‌సి కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించబడనున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి సువర్ణలత దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి పిజి సెట్ -2024 క్వాలిఫై అయ్యి, ఇప్పటివరకు అడ్మిషన్ పొందని వారు మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్స్‌కి అర్హులు. అర్హులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని సూచించారు. వివరాల కోసం www.spmvv.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖలో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా (పి. లలిత కుమారి) తమ తండ్రి పేరిట నెలకొల్పిన పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమాన్ని తెలుగు అధ్యయనశాఖ నవంబర్ 27న నిర్వహించ తలపెట్టింది. ఇందులో భాగంగా తెలుగు అధ్యయన శాఖ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని శాఖల విద్యార్థులకు కథల పోటీని నిర్వహిస్తుంది. అందుకుగాను స్త్రీకి సామాజిక భద్రత ఎలా ఇవ్వొచ్చో ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని కథను రాయాలి. ఉత్తమ కథగా/ కథలుగా ఎంపికైన వాటి రచయితలకు సదస్సు జరిగే రోజున కేటాయించిన రూ.10,000లు నగదును, జ్ఞాపికలను ఇచ్చి సత్కరిస్తుందని, తుది నిర్ణయం తెలుగు అధ్యయన శాఖ, విశ్వవిద్యాలయం ఏర్పర్చిన కమిటీది అని సదస్సు సంచాలకులు డాక్టర్ డి.యువశ్రీ తెలిపారు. మరిన్ని వివరాలకు 98859 40011కు సంప్రదించాలన్నారు.

హరిప్రియకు డాక్టరేట్



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా వర్శిటీ విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని సి.హరిప్రియకు వర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ఆచార్యులు సునీత బాయ్ మార్గదర్శకత్వంలో " ఏ స్టడీ అఫ్ క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటలిజెన్స్ అండ్ దేఇర్ ఎఫెక్ట్ ఆన్ అకాడమిక్ అచీవ్మెంట్ ఇన్ సైన్స్ అఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్" అనే అంశంపై పరిశోధన సమర్పించినందుకు గానూ ఆమెకు డాక్టరేట్ లభించిందని వర్శిటీ డీన్ అఫ్ ఎక్సమినేషన్స్ ఆచార్య జీవన జ్యోతి తెలిపారు.

వరలక్ష్మికి..



శ్రీ పద్మావతి మహిళా వర్శిటీ విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని కె.వరలక్ష్మికి వర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ఆచార్యులు డి.శారదా మార్గదర్శకత్వంలో " క్యాన్సర్ బారిన పడి సురక్షితులైన వారి ఆహార పోషణస్థితి, జీవనశైలి, ఆహార ప్రవర్తనలపై జీవన నైపుణ్యాలతో భోధన ప్రభావము" అనే అంశంపై పరిశోధన సమర్పించినందుకు గాను ఆమెకు డాక్టరేట్ లభించిందని వర్శిటీ డీన్ అఫ్ ఎక్సమినేషన్స్ ఆచార్య జీవన జ్యోతి తెలిపారు.

పరామర్శ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలం తడుకు పంచాయతీ టిఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు డి అమర్నాథ్ రాజు తండ్రి డి.రాజేంద్ర రాజు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గురువారం ఆ గ్రామానికి వెళ్లి రాజేంద్ర రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట సర్పంచి బొబ్బిలి వెంకటేష్ యాదవ్, టిడిపి నాయకులు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

తొండమనాడు చెరువును పరిశీలించిన కలెక్టర్



చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలం పరిధిలోని తొండమనాడు చెరువును కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ గురువారం పరిశీలించారు. వర్షాలకు ముందు తక్కువ నీరు నిల్వ ఉండి ప్రస్తుతం పూర్తి స్థాయిలో 229.48 ఎంసిఎఫ్టి నిండి కలుజు పారుతున్న నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మదన గోపాల్, ఈఈ రాధాకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డిలు కలెక్టర్ వెంట ఉన్నారు. చెరువు పూర్తి స్థాయిలో నిండడం ద్వారా 4386 ఎకరాల ఆయకట్టుకు ఎంతగానో ఉపయోగం కానున్నదని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. డీసిల్టేషన్ చేపడితే రైతుల పొలాలకు సాఫీగా నీరు అందుతుందని అధికారులు తెలపగా నిధులు సమకురుస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు నాలుగు రోజులు తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో శ్రీకాళహస్తి, ఏర్పేడులో 8 నుండి 9 సెంమీల వర్షం కురిసిందన్నారు. దీని ద్వారా పలు చెరువులలో నీరు చేరిందని, వర్షాలకు తొండమనాడు చెరువులో సదరు వర్షాలకు ముందు 0.1టిఎంసి నీరు నిల్వ ఉండేదని ఇప్పుడు 0.5టిఎంసిల నీరు నిల్వ ఉంటూ కలుజు పారుతోందని, దీని ద్వారా 14గ్రామాల పంటలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో 350 పైచిలుకు ఇళ్లలో నీరు చేరిన నేపథ్యంలో వారిని పునరావాస కేంద్రాలలో ఉంచి వారికి భోజనం, తాగు నీరు, మందులను అందించడం జరిగిందన్నారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. డ్రైన్ వాటర్‌ను వినియోగించుకుంటే చాలా మంచిదని సీఎం ఎప్పుడూ చెబుతుంటారు అని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీ నారాయణ, ఎంపిడివో ఫటాన్ రఫీ ఖాన్, మండల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కలెక్టర్ పరామర్శ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని చిన్నప్పకుంట ఎస్‌టీ కాలనీ, కందాడు పంచాయతీలో కూలిపోయిన మట్టి మిద్దెలు, పూరే గుడిసెలను పరిశీలించి బాధితులను కలెక్టర్ పరామర్శించారు. జి గంగమ్మ, జి చంద్రమ్మ, ఎం చెంచమ్మల మట్టిమిద్దెలు, పూరే గుడిసెలు కూలిపోయాయని వారికి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందిస్తామని, పట్టాలిచ్చి ఇల్లు కట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. ఇల్లు లేని నిరుపేదలు ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఆ గ్రామ ప్రజలు నీటి ట్యాంకు గురించి అడగగా జేజేయం క్రింద ఆర్డబ్ల్యూఎస్ వారు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏర్పేడు తహశీల్దార్ భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, హౌసింగ్ ఏఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనవని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. గురువారం తిరుపతి కళ్యాణ్ రెసిడెన్సిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్మారక జాతీయ అవార్డుల ఫంక్షన్ ఘనంగా జరిగింది. కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం డాక్టర్ సుందరరావు నేతృత్వంలో జరుగింది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి అతిథులు, అవార్డు గ్రహీతలు విచ్చేశారు. తొలుత రాజీవ్ గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ముఖ్య అతిథిగా హాజరైన చింతామోహన్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. సాంకేతిక విప్లవం, పంచాయతీ రాజ్ చట్టం తెచ్చి, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లకు నేరుగా స్థానిక సంస్థలకు నిధులు ఇచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. అవినీతి నిరోధక చట్టానికి పదును పెట్టిన నాయకుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. రాజీవ్ గాంధీ మరణం దేశానికి తీరని లోటు అన్నారు. దేశంలో ఆకలి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, అలాగే ఇందిరాగాంధీతో కూడా స్టూడెంట్‌గా అనేక సార్లు కలిసి, విద్యార్థులకు స్కాలర్‌షిప్లు ఇవ్వాలని కోరానని, నేడు విద్యార్థులు అన్నత చదువులు చదవడానికి ఇందిరాగాంధీ కృషేనని వెల్లడించారు. కార్యక్రమంలో కర్నాటక రాష్ట్రం ఫైనాన్స్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ స్వామి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- డాక్టర్ ఆనందమూర్తి



హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యాధికారులు పని చేసి ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి అన్నారు. గురువారం చంద్రగిరిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని అన్ని విభాగాలలో రికార్డులను, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపి ఏ మేరకు వస్తున్నది అనే విషయాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణలో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య పనులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత రంగనాథం మృతి



ఏపీ రంగనాథం (ఫైల్)

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కమ్యూనిస్టు నేత ఏపి రంగనాథం గురువారం మరణించారు. కుటుంబ సభ్యులను గురువారం సాయంత్రం కుప్పం పట్టణంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఏపీ రంగనాథం తండ్రి ఏపీ వజ్రవేలుశెట్టి సిపిఎం నుంచి 1962లో కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు భావజాలాలను నింపుకున్న ఆయన పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారు. చిన్నతనం నుంచి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన అభిప్రాయాలను గౌరవిస్తూ పెరిగారు. రంగనాథం తండ్రి ఆశయాలకు విలువనిస్తూ తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు భావజాలాలతో పేదల పక్షాన నిలుస్తూ నిరంతరం పోరాడారు. గత కొంతకాలంగా రంగనాథం అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన కుమారులు ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించారు. గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన మరణంపై స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామీణాభివృద్ధికి ఉపాధి నిధులు

- డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), పుత్తూరు టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల అభివృద్ధికి రూపొందించిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలలో దీర్ఘకాలిక ప్రయోజన కార్యక్రమాలను కలిగిస్తుందని, అందుకు నరేగా నిధులు సమకూర్చుతున్నామని డ్వామా శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో పల్లె పండుగ ద్వారా ఎస్సీ, ఎస్టీలు నివాసాలు ఉండే చోట 50కోట్లతో సిసి రోడ్లు, 30 కోట్లతో సిసి డ్రైన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అనిమల్ షెల్టర్‌లు ప్రస్తుతం వెయ్యి అంచనాగా పెట్టుకోని ఇప్పటికే 650అనిమల్ షెల్టర్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. శ్మశాన వాటికల అభివృద్ధికి, ఇటీవల శ్మశానానికి వెళ్లే మార్గాలు లేక ఇబ్బందులు పడటం గమనించామని, ఆయా గ్రామస్థులు సమైఖ్యంగా ఆలోచించి మార్గం కోసం నిర్ణయం తీసుకోంటే 100మీటర్ల మేర సిసి రోడ్డును వేయడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. పల్లె పండుగలో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలో మండలానికి రెండు కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేశామన్నారు. 50లక్షలతో రోడ్లపై తిరిగే పశువులకు షెల్టర్ నిర్మాణానికి అనిమల్ హస్బెండరీ విభాగానికి చెందిన ఎకరా స్థలం రేణిగుంట వద్ద ఉందని, అందులో రోడ్లపై తిరిగే పశువులు, పశువులు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వాటిని సంబంధిత అధికారులు ఈ షెల్టర్‌కు తీసుకోచ్చేలా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇది మంచి ఫలితం ఇస్తుందన్నారు. దామినేడు హౌసింగ్ కాలనీ వద్ద ప్రజల ప్రయోజనార్థం యూడిఎస్ నిర్మాణానికి కోటి రూపాయలను మంజూరు చేశామన్నారు. తిరుపతి జిల్లా అటవీశాఖ పరిధిలో 9రేంజిలలో నర్సరీల ఏర్పాటుకు జిల్లా అటవిశాఖ అధికారి వివేక్ డ్వామా సహకారం కోరారన్నారు. ఇందుకోసం ఒక్కో నర్సరీలో 60వేల మొక్కలు తయారు చేసి వనాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పల్లె పండుగ ప్రభుత్వ సంకల్పానికి దీటుగా జిల్లాలో పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ స్పష్టం చేశారు.



సిసి రోడ్డు నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న పీడీ శ్రీనివాస ప్రసాద్

దొరవారిసత్రం: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తల్లంపాడులో రూ.5లక్షలు, మోదుగులపాలెం రూ.5లక్షలు, వెదురుపట్టు రూ.11లక్షలు, బూదూరు రూ.5లక్షలతో వివిధ అభివృద్ధి పనులను అధికారులు మంజూరు చేశారు. గురువారం పలు పనులకు సంబంధించి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్, టీడీపీ నాయకులు భాస్కర్, విజయ్, పరంధామయ్య, పంచాయతీ కార్యదర్శి ఖాదర్ మస్తాన్, ఏపీఓ భాస్కర్, ఎంపీటీసీ సుగుణ, తల్లంపాడు సర్పంచ్ వీణ, బూదూరు సర్పంచ్ చెంగయ్య, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని అంజిమేడు, కోబాక పంచాయతీలలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా అంజిమేడు పంచాయతీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ రోడ్డు 273 మీటర్ల పొడవుతో సుమారు రూ.10లక్షల అంచనా వ్యయంతో చేపట్టడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సీవీ శ్రీనివాస్ ప్రసాద్ పాల్గొని స్వర్ణ గ్రామాలకు పునాది ఉపాధి నిధులు సద్వినియోగంతోనే సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం కోబాక మిట్ట ఎస్టీ కాలనీ నందు సిమెంట్ డ్రైన్ 175 మీటర్ల పొడవు సుమారు రూ.7లక్షలతో అంచనా వ్యయంతో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ సౌభాగ్యం, అధికారులు సుబ్రహ్మణ్యం, రవితేజ, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డుల కాలనీలోకి నివాస గృహాల్లో వరద నీరు చేరాయి. దీంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే తుడా మాజీ ఛైర్మన్, వైసీపీ యువనేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువారం సాయంత్రం పర్యటించారు. గుడిసెల్లో నివాసం ఉంటున్న మహిళలను ఓదార్చారు. దినసరి కూలిలుగా జీవనం సాగించే అక్కడి వారందరూ గత మూడు రోజులుగా ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. తినడానికి అవసరమైన బియ్యం, పప్పు, ఆయిల్, ఎర్రగడ్డలు, ఉల్లిగడ్డలు రవ్వ, శనగపిండి, మసాలా దినుసులతో కలిసి 14రకాల నిత్యావసర సరుకులను ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. అనంతరం మోహిత్ రెడ్డి కాలనీలో పర్యటిస్తూ కష్టాల్లో ఉన్న వారికి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, వైస్ ఎంపీపీ మాదవ రెడ్డి, లింగేశ్వర నగర్ సర్పంచ్ కోటీశ్వరరెడ్డి, వైసీపీ నేతలు బత్తల సుబ్రమణ్యం, రాజు యాదవ్, గంగిరెడ్డి, నాగ భూషణం, ముదిరాజ్, కొత్తపాటి మునీశ్వరరెడ్డి, చెంచు మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కేకేవీ పురంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడక



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని కట్టకింద వెంకటాపురం గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వాక్ ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడక అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రాసంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో మానవ అక్రమ రవాణా నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఎన్జీవో ఆస్ట్రేలియా ఏ 21, ది మూమెంట్ ఇండియా ముంబై వారి సహాయ సహకారాలతో గ్రామ జ్యోతి సొసైటీ మదనపల్లి వారి సౌజన్యంతో స్థానిక సివిల్ సొసైటీ సంస్థ, సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ (సిఎస్‌డి) ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై నిశ్శబ్ద ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మార్కండేయ నాయుడు, జయ వేలు, స్థానిక ఎస్ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల వారి 495వర్ధంతిని బలిజ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షులు పి శివయ్య మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్య చక్రవర్తి దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన గొప్ప చక్రవర్తి, చంద్రగిరి పరిపాలన దక్షుడు బలిజ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీకృష్ణదేవరాయలు అని అన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు మెకానిక్ శివ, గోపి రాయల్, రాజేంద్ర, కృష్ణయ్య. ప్రకాష్, ప్రముఖ న్యాయవాది యూఎస్ రాయుడు, మునయ్య, సత్య, రఘు, రాజేంద్ర, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు బాధితులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జావిద్ కుమార్


ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని వరద ముంపు ప్రాంతంలో నివాసాలు ఉంటున్న ప్రజల కోసం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలలో కమ్మపల్లి పీహెచ్సీ వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం మండలంలోని కమ్మపల్లి, సి రామాపురం (వెరిటాస్ సైనిక స్కూల్)లో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రంలో కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జావిద్ కుమార్, వైద్య సిబ్బంది 50మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటరమణ పునరావాస కేంద్రాలను పరిశీలించి భోజనం, తాగునీరు, వసతి సౌకర్యాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్వో ఝాన్సీ రాణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ అధ్యక్షతన జరిగిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు విద్యార్థులు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.వి. రమణ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవిత ప్రయాణం భావితరాలకు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. సంస్కృత ఆదికవిగా ప్రసిద్ధి గాంచిన మహర్షి వాల్మీకి రచించిన రామాయణ మహాకావ్యం నేటికీ సమస్త మానవాళికి ఆదర్శం అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం.వీ.ఎస్ నాయుడు, డాక్టర్ రెడ్డి శేఖర్, డాక్టర్ వేమన, డాక్టర్ చంద్రిక, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ మోహన్ నాయుడు, కళాశాలవిద్యార్థి వ్యవహారాల అధికారి డాక్టర్ ఎంఎస్‌వి చలం తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కళ్యాణ వెంకన్న విహారం



గరుడ వాహనంపై విహరిస్తున్న కళ్యాణ వెంకన్న

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): పౌర్ణమి పురస్కరించుకుని శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గరుడ సేవ నిర్వహించారు. గురువారం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అనంతరం పీఠంపై అదృష్టంప చేసి పట్టు వస్త్రాలు బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, గోవింద నామ స్మరణలు, భక్త భజనలు నడుమ ఆలయ మాడవీధుల్లో విహరించారు. భక్తులు ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులిచి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, టెంపుల్ సూపరింటెండెంట్ తేనేపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇనస్పెక్టర్ అనంబట్ల ధన శేఖర్, అర్చకులు అర్చక పార్థసారథి స్వామీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ ఏవి రమణ

ప్రజాశక్తి-వెంకటగిరి: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఏవి రమణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు.. పట్టణంలోని అంబేద్కర్ నగర్ సమీపంలో దాడులు నిర్వహించి విక్రేత అబ్దుల్ ఖాదర్ బాషాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇతను ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో పరిచయమై అతని వద్ద నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. అతని వద్ద నుంచి 120గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చైన్ స్నాచర్స్ అరెస్టు



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ వెంకటేశులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సినీ ఫక్కీలో మహిళల మెడలో బంగారు గొలుసులు అపహరించే ఇద్దరు నేరగాళ్లను గురువారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టూ టౌన్ సీఐ వెంకటేశులు కథనం మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద సాధారణ గస్తీ కాస్తున్న పోలీసులకు అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులు తారస పడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా అపహరించిన బంగారు చైను బయటపడింది. పట్టుబడిన వారు తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన శశి కుమార్(23), సురేష్(20)లుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు - కొండగుంట రైల్వే ఎగువ మార్గంలోని రైలు పట్టాలుపై గుర్తు తెలియని యువకుడు మృత దేహం లభ్యమైంది. గూడూరు రైల్వే పోలీసుల కథనం మేరకు యువకుడు వయస్సు (25) ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంటల పరిశీలన



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరి పైరును వ్యవసాయ అధికారిని భారతి గురువారం పరిశీలించారు. మండలంలోని కనుమనంబెడు, నేరిని కండ్రిగ, తలారి పెట్టు తదితర గ్రామాలలో నీట మునిగిన పైర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రైతులకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు.